బీసీ డిక్లరేషన్ అమలుకు ఉద్యమం

- హామీకి అనుగుణంగా బీసీ చట్టం తేవాలి
- కులగణనతోనే సమస్యకు పరిష్కారం
- నల్లగొండ బీసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

నల్లగొండలో బీసీ హక్కుల సాధన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, జూలూరు, రాంచందర్‌రావు, రాజారాంయాదవ్ తదితరులు

నల్లగొండ, మార్చి 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, లేదంటే ఉద్యమం తప్పదని భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సాహితీవేత్త జూలూరు గౌరీ శంకర్ అధ్యక్షతన బీసీ హక్కుల సాధన కోసం స్థానిక చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడుతూ.. బీసీ బిల్లుపై తీర్మానం చేసి సరిపెట్టడం కాదని, ఇచ్చిన హామీకి అనుగుణంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్ కోసం ఏటా 20 వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఐదేండ్లకు లక్ష కోట్లు కేటాయించి బీసీ కులాల కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

కులగణన హామీ నెరవేర్చాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కులగణన చేస్తే బీసీలకు 23,500 పదవులు వస్తాయన్న హామీని నెరవేర్చాలని కోరారు. కులగణన చేస్తే రిజర్వేషన్ విషయంలో స్పష్టత వస్తుందని చెప్పారు. బీసీలకు రాజ్యాధికారం రావాలన్నా, విద్య, ఉద్యోగావకాశాల్లో న్యాయం జరగాలన్నా, న్యాయస్థానాల్లో సముచిత స్థానం దక్కాలన్నా కులగణన ఒక్కటే మార్గమని అభిప్రాయపడ్డారు. బహుజనుల కోసం పోరాటం చేసిన పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేస్తామన్న హామీపై ప్రభుత్వం ఎందుకు వెనక్కుతగ్గుతున్నదని ప్రశ్నించారు. అంతకుముందు బీసీ సంఘాల నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని, లేదంటే ఉపేక్షించేది లేదని ముక్తకంఠంతో హెచ్చరించారు. సమావేశంలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, సత్యనారాయణ, రాంచందర్‌నాయక్, గట్టు రాంచందర్‌రావు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల కుంభకోణంలో బాబుపై సీఐడీ చార్జిషీట్

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ): అసైన్డ్ భూముల కుంభకోణంలో ఏపీ సీఐడీ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై చార్జిషీట్ దాఖలు చేసింది. 4,400 కోట్ల మేర కుంభకోణం జరిగినట్టు సీఐడీ నిర్ధారించింది. ఈ కేసులో చంద్రబాబు ప్రధాన నిందితునిగా ఉన్నారు. ఆయనతోపాటు మాజీ మంత్రి నారాయణ పేరును కూడా సీఐడీ తన చార్జిషీట్‌లో పేర్కొంది. రాజధాని అమరావతిలో 1,100 ఎకరాల అసైన్డ్ భూముల కబ్జా, క్యాపిటల్ సిటీ ప్లాన్‌తో కుంభకోణం జరిగినట్టు సీఐడీ పేర్కొంది. ఇందుకోసం రికార్డులను ట్యాంపరింగ్ చేశారని తెలిపింది. సుధీర్‌బాబు, అంజనీకుమార్ కూడా నిందితుల జాబితాలో ఉన్నారు.

పసుపు @ 18,299

ఖలీల్‌వాడి/మెట్‌పల్లి/ఖమ్మం వ్యవసాయం, మార్చి 11: మునుపెన్నడూ లేని విధంగా పసుపు రేట్లు ఈ ఏడాది సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. నిజామాబాద్ మార్కెట్‌లో సోమవారం గరిష్ఠంగా రూ.18,299 ధర పలికింది. గత చరిత్రను తిరగరాస్తూ కొత్త ధర నమోదు కావడం విశేషం. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పసుపు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.16,205 పలికింది. పసుపు కాడి (కొమ్ము)కు ఈ ధర పలుకడం గడిచిన పదేండ్లలో ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా మిర్చి గరిష్ఠ ధర సోమవారం రూ.20,650కే పరిమితమైంది. మధ్యరకం ధర రూ.19 వేలు, కనిష్ఠ ధర రూ.13,800 పలికింది. రోజురోజుకూ ధర పతనమవుతుండటంతో రైతులు సరుకును కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు.

బోయిగూడలో నేషనల్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మిడ్‌వైఫరీ వ్యవస్థ పనితీరు భేష్

- మంత్రి దామోదర రాజనర్సింహ
- నేషనల్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

బన్సీలాల్‌పేట, మార్చి 11: రాష్ట్రంలో మిడ్‌వైఫరీ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తున్నదని, మాతా-శిశు సంరక్షణకు ఎనలేని కృషి చేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసించారు. సికింద్రాబాద్ న్యూబోయిగూడలోని పాత గాంధీ వైద్య కళాశాల బాలికల హాస్టల్ భవనంలో రూ.1.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నేషనల్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణలో మరిన్ని మిడ్‌వైఫరీ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో 2017 నుంచి మిడ్‌వైఫరీ శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న యూనిసెఫ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌లను ఆయన అభినందించారు. మిడ్‌వైఫరీ శిక్షణను పూర్తిచేసుకున్న 350 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, బన్సీలాల్‌పేట కార్పొరేటర్ కే హేమలత, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కణ్ణన్, డీఎంఈ వాణి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్, సికింద్రాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు తీసుకెళ్తే సస్పెన్షనే..

- 'పబి' పరీక్షల నేపథ్యంలో కఠిన నిబంధనలు
- స్క్వాడ్, అధికారులొచ్చినా తనిఖీలు తప్పనిసరి
- 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు
- సమస్యల పరిష్కారానికి డయల్ 040 -23230942

పరీక్షలు రాయనున్న విద్యార్థులు	
బాలురు	2,57,952
బాలికలు	2,50,433
మొత్తం	5,08,385

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ సమయంలో పరీక్షాకేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఇక తనిఖీలకు వచ్చే అధికారులు, కలెక్టర్లు, పోలీస్, విద్యాశాఖ ఉన్నతాధికారులు సెంటర్లలోకి సెల్‌ఫోన్లు తీసు కెళ్లడాన్ని అనుమతించరు. వీరు తమ సెల్‌ఫోన్లను ఆరుబయటే పెట్టాల్సి ఉంటుంది. పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒక వేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. నిరుడు పదో తరగతి ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లలో ప్రత్యక్షంకావడం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఎస్సెస్సీ బోర్డు ఈ నిర్ణయం తీసుకొన్నది.

కంట్రోల్ రూం..

ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షలకు 5.08లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ దృష్ట్యా రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే 040 -23230942 నంబర్‌ను సంప్రదించవచ్చు. ఈ పరీక్షల నిర్వహణ దృష్ట్యా ఇప్పటికే 12 మంది ఉన్నతాధికారులను జిల్లాస్థాయి అబ్జర్వర్లుగా నియమించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే స్కూళ్లకు పంపించగా, విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్నిచ్చారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో పరీక్షాకేంద్రాల సమీప స్టేషన్ వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఎస్సెస్సీ బోర్డు నామినల్‌రోల్స్, ఫొటో అటెండెన్స్ షీట్లు జిల్లాలకు చేర్చగా, తాజాగా ఓఎమ్మార్, ప్రశ్నపత్రాలు, సమాధానాల రాసే పేపర్లు, బుక్‌లెట్‌లను జిల్లాలకు పంపిస్తున్నది.

అబ్జర్వర్లు నియోజకవర్గం దాటి వెళ్లొద్దు

- వారి వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్
- సమీక్షలో అబ్జర్వర్లకు సీఈసీ ఆదేశం
- ఆన్‌లైన్‌లో పాల్గొన్న సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అబ్జర్వర్లు తమకు కేటాయించిన నియోజకవర్గం దాటి వెళ్లొద్దని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ప్రతి అబ్జర్వర్ వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 2,100 మంది పోలీస్, జనరల్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లతో ఎన్నికల ఏర్పాట్లపై సోమవారం ఆయన ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్‌కుమార్ మాట్లాడారు.

పట్టపగలు నయీం అనుచరుడి హల్‌చల్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 11: భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ప్రాంతంలో నయీం అనుచరుడు, రౌడీషీటర్ బా బా కొబ్బరి బొండాల కత్తితో సాయితేజ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు నరేశ్‌పై దాడి చేయగా.. నరేశ్ చెవి, మెడ, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న నరేశ్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. డీసీపీ రాజేశ్‌చంద్రతో ఫోన్‌లో మాట్లాడి దాడి చేసిన బాబా, సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక దర్యాప్తు సంస్థకు ప్రణీత్‌కుమార్ కేసు?

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): మాజీ డీఎస్పీ ప్రణీత్‌కుమార్ కేసును ప్రత్యేక దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ఎస్ఐబీ (స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో) ఉన్నతాధికారులు యోచిస్తున్నట్టు తెలిసింది. ఎస్ఐబీలో పనిచేస్తూ విలువైన సమాచారమున్న హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు ఇతర సామగ్రిని ధ్వంసం చేశాడనే ఆరోపణతో ఆయనపై హైదరాబాద్ పంజాగుట్ట ఠాణాలో ఆదివారం ఎస్ఐబీ అదనపు ఎస్పీ రమేశ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌పై కేసు నమోదైంది. ఆయన కోసం పంజాగుట్ట పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

సంజయ్ దీపక్‌రావుపై ఎన్ఐఏ చార్జిషీట్

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ): దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని వ్యాప్తి చేసేందుకు కుట్ర పన్నాడన్న కేసులో నిషేధిత మావోయిస్టు పార్టీ అగ్